



కదిలిస్తే కావ్యం వంటివాడు శిశువు! చిత్రనిద్రలోవి శిశువూ, భాండాగారంలో పుస్తకమూ

# అణుబాంబులతో అనుక్షణం చిత్రవధ! దిగజారిపోతున్న నైతిక విలువలకోసం ఓ వ్యక్తి వ్యథ!!

## డియర్ మీనా!

నేను నీ ఉత్తరాలకి జవాబు వ్రాయలేదని నీకు కోపం వచ్చిందా? నెలకి రెండుసార్లు తప్పకుండా నీ దగ్గరనుంచి ఉత్తరాలు వచ్చేవి. అవి రాలేదని, రావటం ఆగిపోయాయని నేను గుర్తించి, పాత ఉత్తరం డేట్ చూసేసరికి, నువ్వు నాకు ఉత్తరం రాసి సరిగ్గా రెండు నెలల 9 రోజులు అయిందని అర్థం అయింది. ఏమైంది మీనాకి? అనుకుని ఫోన్ ట్రై చేశాను. నువ్వు ఇంట్లో లేవు. శిరీష ఫ్రెండ్ బర్త్‌డేకి వెళ్లావని మీవారు చెప్పారు. నువ్వు, పిల్లలు కులాసాగానే ఉన్నారని అన్నారు. నేను ఒక్క ఉత్తరానికైనా జవాబు వ్రాయడంలేదని అలకగా ఉన్నావని రాజారావు గారు అన్నారు. కనీసం నీవెలా ఉన్నావో కూడా కనుక్కునే ధ్యాస కూడా లేకుండా పోయిందని ఫీలయ్యావని అన్నారు. ఏమిటి మీనా! నువ్వు కూడా మామూలు వాళ్లలా మాట్లాడితే నేనేమనుకోవాలి చెప్పు? నువ్వు నాకెప్పుడూ గుర్తుంటావు. మీ ఆఫీసులో వాటి బిల్ మీద, నిరోషతో కలిసివున్న నీ ఫోటో రోజుకు ఎన్నిసార్లు చూస్తానో నీకు చెప్పేవుంటాను. ఏంచెయ్యమ మీనా! ఈ ప్రపంచంలో మనిషికి టైమ్ కరువు విపరీతంగా కనిపిస్తోంది. ఎవరిని చూసినా హడావుడి పరుగు! మీరూ అంతే! ఎన్నోసార్లు అనుకుంటాను. జీవితం ఇలా ఉరుకూ పరుగులతో హడావుడిగా ఉండకూడదు. నిదానంగా మనం జీవితం జీవిస్తున్నాం అనే అనుభవం దక్కేటంత విశ్రాంతిగా ఉండాలని. కుండెడు మజ్జిగ చిలికితే గోరుముద్దంత వెన్న వచ్చినట్లు వంద సంవత్సరాలు బతికితే ఆ జీవితంలో ఎక్కడో ఎప్పుడో ఏకాస్త మనశ్శాంతి దొరుకుతుంది. ఈ ప్రపంచంలో ఏ ఒక్క మనిషిలో నాకు స్థిమితం కన్పించటంలేదు.

కువైట్ రాజుగార్కి తన కువైట్ తిరిగి ఎప్పుడు పొందుతామా అన్నంత ఆందోళన ఉన్నట్లే నాకు రేపు పనిమనిషి వస్తుందా, పంపులో నీళ్లు వస్తాయా? నేను సమయానికి ఆఫీసుకి వెళ్లగలనా అని నాకు కూడా అంత ఆందోళనగా ఉంటుంది. ఆందోళనకి కారణం రాజ్యం అయినా పనిమనిషి అయినా, శరీరంలో జరిగే ప్రక్రియ ఒకటే.



యద్దనపూడి సులోచనారాణి

ఆదుర్దా ఫలితం బ్లడ్ ప్రెషర్! లేక డయాబిటిస్! అవి గుర్తుకువచ్చి ఆందోళన పడ్తున్నానే, ఆ వ్యాధులు వస్తాయోమోనని మరీ ఆందోళన. ఇలా ఉంది జీవితం. మా కొడుకు దీపూ నా దగ్గరే పెరుగుతున్నాడని నీకు తెలుసుగా, పిల్లలు లేని నేను వాడిని దగ్గరకు తీసుకుంటే మాతృత్వ మధురిమలు, బజారులో పాలడబ్బా కొన్నంత తేలికగా అంది పుచ్చుకోవచ్చునని ఆశపడ్డాను. వాడిని తీసుకు వచ్చింతర్వాత ఇంట్లో సందడి బాగానే ఉంది! కానీ ఆ సందడి నేను ఊహించినదానికంటే మితిమీరిపోయి నా ఆఫీసు ఫైల్స్ ఇంటికి తెచ్చినప్పుడు చూసే వ్యవధి లేకుండా పోయింది. వాడికి అన్నీ ఇచ్చాను. వాడి గది ప్రత్యేకం! బొమ్మలు ప్రత్యేకం! వాడి తిండి ప్రత్యేకం. బాగా డబ్బులు ఖర్చుచేసి, వాడికి ఏ తల్లీ ఇవ్వని ప్రత్యేక ప్రపంచం ఇచ్చానని గర్వపడ్డాను. కానీ నా గర్వం తొందరలోనే ఆవిరైపోయింది. వాడితో నేను వేగలేనని అన్పించింది. వాడికి సవాలక్ష సందేహాలు. టివిలో గల్ఫ్‌యుద్ధం చూసి 'భారతం సీరియల్ మళ్లీవస్తోందా అంటాడు. 'కాదని', 'ఇది నిజం యుద్ధం అని చెప్పాను'.

'నిజం యుద్ధం అంటే?' అన్నాడు.

'దేశాల మధ్య పోట్లాట' అన్నాను.

'దేశాలు ఎందుకు పోట్లాడుకుంటాయి?' అన్నాడు.

'ఏవో చిరాకులు' వీడికి వివరంగా చెబుతూ కూర్చుంటే నా ఆఫీసు రిపోర్ట్ ఈ రాత్రి వ్రాయలేను.

'చిరాకులు అంటే' చెప్పేవరకూ వదలడు.

'ఏవో సమస్యలు' అన్నాను.

'సమస్యలు అంటే'

నేను దిక్కులు చూశాను. 'వెళ్లునువ్వు పోయి పడుకో' అన్నాను.

'చెప్పు పెద్దమ్మా' చేయి పట్టుకుని బతిమాలాడాడు.

ఆ క్షణంలో వాడిని చూస్తే జాలేసింది.

పసిహృదయం! ఈ లోకం గురించి తెలుసుకోవాలని ఆరాటం. వాడిని ఎత్తుకుని ఒడిలో కూర్చోపెట్టుకున్నాను. వాడికి అర్థమయ్యేట్లు చెప్పాలిమరి! 'చూడు పెద్ద మావయ్యా, చిన్న మావయ్యా ఊళ్లో పొలం కోసం పోట్లాడుకో లేదూ ఇది కూడా అంతే'

'వాళ్లకీ పొలాలున్నాయా?'

'అవును. అవి చమురు పొలాలు'

ఇంతలో టివిలో గల్ఫ్‌యుద్ధం వార్తల్లో బుష్‌గారు ప్రసంగించటం వచ్చింది.

'ఈయనకి కళ్లజోడు ఉందిగా ఈయన పెద్ద మావయ్యా', చప్పట్లు కొడుతూ అన్నాడు. తల ఊపాను. తర్వాత సద్దాం గారు కన్పించారు.

'ఈయనకి మీసాలున్నాయి. చిన్న మామయ్యా' అన్నాడు. తలూపాను.

అలాగా!

'మరి పోట్లాడుకుంటూ దీపావళి పండగ చేసుకుంటారు ఎందుకు!'

'పండగేమిటి?'

అదిగో! మతాబులు ఎలా వెలుగుతున్నాయో అన్నాడు.

వీడికి చెప్పలేక ఊరుకున్నాను.

ఆరోజునుంచి వాడు టీవీలో బుష్‌గారు కన్పించగానే 'పెద్దమ్మా పెద్దమావయ్య వచ్చాడు రా రా' అంటూ కేకపెట్టాడు. 'ఇదేమిటి ఉత్తరం పత్తరం లేకుండా ఊరినుంచి పెద్దన్నయ్య ఊడిపడ్డాడు అంటూ పొంగుతున్న పాలగిన్నె వదిలి పరిగెత్తు...

'మామయ్య ఏడిరా' అన్నాను. 'వెళ్లిపోయాడు' అన్నాడు.

నేను ఒక్కటి వేశాను! వెధవా! అబద్ధాలు ఆడతావా! అన్నాను.

వాడు ఏడుపు లంకించుకున్నాడు.

'అదిగో' మళ్లీ వచ్చాడు అంటూ వేలుపెట్టి టీవీ చూపించాడు. బుష్‌గారు ప్రసంగిస్తున్నారు. నేను నిట్టూర్చాను. వీడి కేకలు మూలంగా పాలు పొంగి బొగ్గు అయినాయికదా! వంటింట్లోకి వెళ్లాను.

పెద్దమ్మా! చిన్న మామయ్య వచ్చాడు' మళ్లీ ఉత్సాహంగా కేకపెట్టాడు.

'వస్తున్నాడా' అన్నాను.


'.......

సద్దామ్ గారు టీవీలో అంతర్థానం అయింతర్వాత దీపూ నా మెడచుట్టూ చేయివేసి 'పెద్ద మావయ్య కంటే చిన్నమావయ్యే బాగున్నాడు. ఎంచక్కా మీసాలు. నాకిష్టం' అన్నాడు. 'యుద్ధం అంటే ఏమిటి పెద్దమ్మా. అందరూ అదే అంటున్నారు' అన్నాడు.

'యుద్ధం అంటే ఏం లేదు. ఇద్దరి మనుష్యుల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చి అరుచుకుంటారే అది' అన్నాను.

ఓహో! అదా తెలిసింది నువ్వూ కనకమ్మ పొద్దుట గిన్నెలు సరిగ్గా కడగలేదని అరుచుకున్నారే అట్లానా'

'అవును' అన్నాను. నిజంగానే పనిమనిషి కనకమ్మతో ఈ రోజు లేస్తూనే యుద్ధం చేశాను. రెండు కొత్త గిన్నెలు పోయినాయి. కన్పించటం లేదు కనకమ్మా' అన్నాను. అంతే 'నా మీద దొంగతనం అంటగడ్తావా. చచ్చినా నీ గుమ్మం ఎక్కను' అని వెళ్లిపోయింది. ముందు అరిచాను. తర్వాత బతిమలాడాను. అది రాలేదు. రాణీగార్లా నడుచుకుంటూ వెళ్లిపోయింది. ఈ రోజుల్లో యజమాన్లు నౌకర్లు అంటే అర్థం మారిపోయింది. మీ మా ఉపాధ్యాయులు విద్యార్థులు యజమాన్లు, నౌకర్లు, తల్లిదండ్రులు,



పిల్లలు వీటికి వేరే అర్థం వ్రాసుకోవాల్సిన రోజులు వచ్చాయి.

మర్నాడు. దీపూ నేను ఆఫీసు నుంచి వచ్చేసరికి మంచం కింద దాక్కుని కూర్చున్నాడు.

'ఏమిటి' అన్నాను. వీడికి ఇంత బలం ఎందుకు వచ్చింది అని ఆశ్చర్యపోతూ, నువ్వు కూడా రా దాక్కో! బాంబులు పడ్తాయి మనమీద అన్నాడు.

'ఎవరు చెప్పారు' అన్నాను. వాడు గొంతు తగ్గించి రహస్యంగా, 'రమణ చెప్పాడు స్కూల్లో! నీకు యుద్ధం అంటే అప్పుడు ఏం తెలియదు పెద్దమ్మా! యుద్ధం అంటే పెద్ద పెద్ద బాంబులు వేస్తారు. అది ఎన్నిమైళ్ల దూరం అయినా వచ్చి పడిపోతుంది. జనం చచ్చిపోతారు! ఆ యుద్ధం ఎదుర్కోవాలీ అంటే మనమంతా తుపాకులు పుచ్చుకోవాలి. ఇదిగో! నా దగ్గర తుపాకి! నేను నా ఉంగరం ఇచ్చి బ్రతిమలాడితే రమణ ఇచ్చాడు. మీ పెద్దమ్మకి ఏం తెలియదు. అందుకే అలా చెప్పింది. యుద్ధం అంటే బాంబులతో చంపటం! మనం ఈ మంచం క్రింద పడుకొని ఎవరన్నా వస్తే తుపాకీతో పేల్చేద్దాం!'

'చాలించు నీ గొడవ' అన్నాను.

నేను వాడికి నచ్చచెప్పాను. పసిమనసు భయపడ కూడదని అనుకుంటే స్కూల్లో ఇలా తెలుసుకువచ్చాడు. వాడు నా మాట నమ్మటం లేదు. నన్ను రక్షిస్తానంటున్నాడు! ఇంతలో ప్లేన్ వెళుతున్న శబ్దం వచ్చింది.


దీపూ ఒక్క ఉదుటున నా మెడ కౌగలించుకున్నాడు.

'బాంబులొస్తున్నాయి' అంటూ ఏడుస్తూ వణికిపోతున్నాడు! పిల్లిమొగ్గలు వేస్తున్నాడు. వాడ్ని మంచి నీళ్లు తాగించి సముదాయించేసరికి నా తలప్రాణం తోకకి వచ్చింది. నిద్రలో కూడా కలవరించాడు. యుద్ధం అంటే ఏమిటో, ఎందుకు చేస్తున్నారో వాడికి చెప్పినా అర్థంగాని వయసు! దీపూకి జ్వరం వచ్చింది. చెల్లెలు మధుమతి వచ్చింది మా ఇంటావిడ, నేను పిల్లాడిని సరిగ్గా చూడటంలేదని ఫిర్యాదు చేసింది. అయినా కన్నతల్లికి కడుపుతీపి తెలుస్తుందిగానీ, అంటూ నా ఎదుటే చెల్లెలిపై విమర్శలు చేసింది మా శారద. 'అక్కా! పిల్లలు లేరు అని తపిస్తున్నానని దీపూని పంపాము. అంతేగాని మాకు బరువై కాదు' అంటూ దీపూని తీసుకొచ్చింది. ఆ విధంగా నేను మళ్లీ ఇంకో యుద్ధంలో ఓడిపోయాను. పిల్లలు పెళ్లి అయిన వెంటనే పుడితే ఉద్యోగానికి ప్రమోషన్ల కోసం చదవాల్సిన చదువులు కష్టం అవుతాయని, ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేశారు. తర్వాత పిల్లలు ఎందుకో కలగలేదు. ఈలోపల ఆయన యాక్సిడెంట్‌లో పోయారు. ఆ విధంగా నా ప్లాన్ నన్ను పిల్లలులేని తల్లిగా మిగిల్చింది. మన జీవితంలో ఎన్నెన్నో ప్లానులు వేస్తుంటాము! కానీ మనం నడవాల్సిన జీవితానికి ఆ దేవుడు ఎప్పుడో ప్లాన్ వేసేసి ఉంచాడని, మనం నిమిత్తమాత్రులం అని, మనం గుర్తు చేసుకుంటే ఈ యుద్ధాలు ఉండవు!

మనసంతా అవిరామ విశ్రాంతి! ఇది ఎందుకు వ్రాసానంటే ఈ దేశాల మధ్య యుద్ధంగురించి, అందరం ఇంత చర్చించుకుంటుంటే కమ్యూనికేషన్ పుణ్యమా అని, ప్రపంచం అంతా వసుధైక కుటుంబం అయిపోయినట్లే అనిపిస్తోంది! ఇదివరకు కుటుంబంలో గొడవ జరిగితే తప్ప వ్యక్తికి అశాంతి ఉండేదికాదు! ఇప్పుడు వీధిలో గొడవజరిగినా మనకే అలజడి! ఊరిలో జరిగితే ఇంకా భయం! ఏ కర్ఫ్యూలు వస్తాయో అని! ఎక్కడో ఏదో దేశంలో జరిగినా మనకే ఆందోళన! ఎందుకంటే దాని ప్రభావం ఏదో విధంగా మన అందరిమీద ఉంటోంది! మనిషి ఎలా ఏకాకిగా, ఉండాలని ఎంత తపిస్తున్నాడో ప్రపంచం అంతకి వేయిరెట్లు అతన్ని చుట్టుకుపోతోంది! ప్రపంచం గిరగిరా తిరుగుతుంటే మనమూ తిరుగుతున్నాం! ఆ వేగంలో కొత్త సుఖాలు కొన్ని వచ్చిపడినా, పాత విలువలు కొన్ని పోగొట్టుకుంటున్నాం! ఉదాహరణకి నీకు ఉత్తరం వ్రాయడం లాటి అపురూపమైన అనుభవం! నేను ఈ జీవనవేగంలో దాన్ని అశ్రద్ధ చేస్తున్నాను. ఎక్కడ అర్థం అవుతుంది. మీనూ లాటి మంచి స్నేహితురాలిని దూరం చేసుకున్నానని! అప్పుడు నన్ను ఎవరు ఓదారుస్తారు! అప్పుడు మళ్లీ వ్యర్థమైన వేదాంతం నెమరువేసుకుంటాను. భగవంతుడు అంతా నిర్ణయం చేసే సంపాదేమోనని! నిజమే! నేను అప్పుడు నాకు నేనే ఒక పనికిమాలిన వ్యక్తిలా ఉంటానేమో! శూన్యం ఆవరించుకున్న ఈ ప్రపంచంలో బ్రతకటానికి ఎలాంటి ఆనందపు ఆసరా లేనట్లుగా కన్పిస్తుందేమో! మీనా! జీవితంలో విలువలకి, ఆనందానికి లంగరు కుదరదనీ, జీవనవ్రతం తెలిసి నిస్సహాయులుగా నిస్తేజంగా, చూస్తున్నవాళ్లు నాలాటి ఎంతమందో! ఈ మౌనయుద్ధం ఎవరికీ వినపడదు. కనపడదు. ఉంటాను మీనా! నిరోషకి, శృతికి నా ఆశీస్సులు. రాజారావు గార్కి నా నమస్కారాలు. ఎప్పుడో చెప్పకుండా నీ ముంగిట వాలిపోతాను. నేను సేదదీరటానికి నాకున్న ఒకే ఒక ఒయాసిస్సువు నువ్వే కదా!

మీ ప్రియమైన

రాజీ




గురించి ఉండే అభిప్రాయాల్ని ప్రతిబింబిస్తుంది. — కొడవటిగంటి కుటుంబరావు